క్లుప్తంగా

ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి


ఫ్లెక్సీని విడుదల చేసిన ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

రాయదుర్గంటౌన్: ఏపీ ఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 4, 5 తేదీల్లో నిరసనలు ఉంటాయని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ తెలిపింది. ఈ మేరకు గురువారం స్థానిక డిపో ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న గేట్‌మీటింగ్, నిరసన కార్యక్రమాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఎస్ వలి, రీజనల్ కార్యదర్శి పీఎస్ ఖాన్, డిపో సెక్రటరీ రామలింగప్ప మాట్లాడారు. 4నుంచి ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని, టీ సమయంలో గేట్ ధర్నా ఉంటుందన్నారు.

బీటీపీ పనులు రేపు పునఃప్రారంభిస్తాం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ప్రాంత ప్రజలకు జీవనాడి అయిన భైరవానితిప్ప ప్రాజెక్టు (బీటీపీ) పనులకు ఈనెల 5న పునః ప్రారంభిస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చెప్పారు. శెట్టూరు మండలం అయ్యగార్లపల్లిలో గురువారం ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో భాగంగాపై వ్యాఖ్యలు చేశారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో పాటు స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఆర్డీటీ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు


మాట్లాడుతున్న సాకే హరి

కళ్యాణదుర్గం రూరల్: ఆర్డీటీని పరిక్షించుకునేందుకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పిలుపునిచ్చారు. గురువారం అక్కమాంబ ఆలయ ఆవరణలో వివిధ కుల సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా స్వచ్ఛందంగా కదిలి వచ్చి ఆర్డీటీని పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు. త్వరలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేయడానికి కమిటీలు వేశామన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం


కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: ఉంతకల్లులో రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయం ఆధ్వర్యంలో గురువారం మెగా ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. కర్నూలుకు చెందిన సుశీల నేత్రాలయ, సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మందికి పరీక్షలు చేయగా, వీరిలో 42 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యులు తెలియజేశారు. కార్యక్రమంలో రుక్మిణీ పాండురంగస్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ


గ్రంథాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పి.రమా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ పన్ను వివరాలను అడిగి తెలుసుకుని, పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయి వెంటనే వసూలు చేయాలన్నారు. అనంతరం పాఠకులతో మాట్లాడుతూ పాఠకులు గ్రంథాలయ సేవలను వినియోగించుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారి బి.ఎర్రిస్వామి, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండలో అగ్రి షాప్ సీజ్


అగ్రి షాప్‌ను సీజ్ చేసిన అధికారులు

ఉరవకొండ: స్థానిక గవిమఠం ఆవరణలో ఏర్పాటు చేసిన శివబాలాజీ అగ్రి ఎంటర్‌ప్రైజెస్ షాప్‌ను మండల వ్యవసాయాధికారి రామకృష్ణుడు, వీఆర్‌ఓ షెక్షావలి గురువారం సీజ్ చేశారు. కూడేరు మండలం శివరాంపేట గ్రామానికి చెందిన ఓ రైతు నుంచి 25 బస్తాల ప్రభుత్వ సబ్సిడీ విత్తనాలను శివబాలాజీ షాప్ నిర్వాహకుడు కొనుగోలు చేసినట్లుగా తెలుసుకున్న అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అయితే అప్పటికే దుకాణానికి తాళం వేసి నిర్వాహకుడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. సబ్సిడీ విత్తనాలు కొనుగోలు చేసినట్లుగా తమతో ఉన్న ఫొటోలు, వీడియోల ఆధారంగా రెవెన్యూ అధికారులతో కలసి దుకాణాన్ని సీజ్ చేశారు.

ప్రగతి రథం..కార్గో సేవలు విస్తృతం

- ఆర్టీసీ కార్గో .. డోర్ డెలివరీతో ప్రజలకు మరింత చేరువ
- సేవలను సద్వినియోగం చేసుకుంటున్న జీన్స్ ఉత్పత్తిదారులు
- రూ.38 లక్షల నుంచి రూ.2.43 కోట్లకు పెరిగిన ఆదాయం


కార్గో కార్యాలయం


జీన్స్ ఉత్పత్తులు తరలిస్తున్న దృశ్యం

రాయదుర్గం: కేవలం ప్రజా రవాణాకే ప్రాధాన్యత ఇస్తూ వస్తున్న ఆర్టీసీ 2016 జూన్ 3 నుంచి కార్గో సేవలు ప్రారంభించి, సరుకు రవాణాలోనూ వేగం పెంచుతోంది. సరికొత్త మార్గాలతో ప్రజలకు మరింత చేరువవుతోంది. విస్తృత నెట్‌వర్క్ కలిగిన ఆర్టీసీ.. ఏటేటా కార్గో సేవలను ప్రజలకు దగ్గర చేస్తూ ఆదాయ మార్గాలు పెంచుతోంది. రాష్ట్రంలోనే జీన్స్ ఉత్పత్తుల కుటీర పరిశ్రమలు రాయదుర్గంలో అత్యధికంగా ఉండడంతో కార్గో సేవల్ని వ్యాపారులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇతర పార్సిల్ సంస్థల వైపు చూడనీకుండా ఇంటి నుంచే పికప్ చేసుకొని హోం డెలివరీ ఇచ్చేలా శ్రీకారం చుట్టారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ విధానం సత్ఫలితాలిచ్చింది.

2017–18లో కేవలం రూ.38.03 లక్షల తో ప్రారంభమైన ఆదాయం 2024–25 నాటికి రూ.2.43 కోట్లకు చేరింది. రాయదుర్గంలో ఏటేటా కార్గో సేవలు మెరుగుపర్చేలా మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ అధికారులు కృషి చేశారు. వ్యాపారుల వద్దకెళ్లి అవగాహన కల్పించడంతో జిల్లాలో మంచి ఆదాయం రాబట్టేలా చర్యలు చేపట్టారు. వచ్చే ఏడాది నాటికి మరింత పెంచేలా కృషి చేస్తున్నారు. తక్కువ చార్జీలకే సర్దుబాటు చేస్తున్నారు.

ప్రైవేటు కంటే మెరుగ్గా సేవలు



కొరియర్, పార్సిల్ రంగంలో ప్రైవేట్ సంస్థల కంటే మెరుగ్గా డోర్ డెలివరీ సేవలందిస్తున్నాం. వినియోగదారులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. రాయదుర్గంలో జీన్స్ ఉత్పత్తులు ఉండడంతో కార్గోకు ఆదాయం సమకూరుతుంది. ఏటేటా ఆదాయం మెరుగుపడుతోంది.

– కే శ్రీనివాసరావు, ఆర్టీసీ, డీఎం, రాయదుర్గం

వినియోదారులు వచ్చేలా కృషి



జీన్స్ ఉత్పత్తి దారులంతా ప్రైవేట్ సంస్థలపై ఆధారపడి పార్సిల్ సేవలు వినియోగించుకునేవారు. ఇంటింటికీ వెళ్లి వారందర్నీ ఆర్టీసీ వైపు రాబట్టేలా కృషి చేశాం. ప్రస్తుతం కార్గో ఆదాయం రూ.2.43 కోట్లకు చేరింది. వచ్చే ఏడాది దీన్ని మరింత మెరుగుపరిచేలా కృషి చేస్తాం.

– ఎమ్.నాగరాజు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, రాయదుర్గం

ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం ధర్నా


ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కళ్యాణదుర్గం: ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతరాయుడు, కుళ్లాయిస్వామి ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు లోకేష్ యువగళం పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు జీఓ 77ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు జూలై 11న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపట్టనున్నట్లు వారు తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజినేయులు, జిల్లా ఆఫీస్ బేరర్లు వెంకట్‌నాయక్, మంజునాథ్, నియోజకవర్గ నాయకులు మౌళి, మౌనిక, ఐశ్వర్య, నవీన్, పవన్, మురళి, పండు, అఖిల్, మోహన్, అజయ్, జగ్గు, మనులతో పాటు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని ధర్నా


కూడేరు : తహసీల్దార్ కార్యాలయ తలుపులు మూసేసి ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

కూడేరు: కూడేరుకు రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. తహసీల్దార్ కార్యాలయంలోని అధికారులు, సిబ్బందిని బయటకు పంపి తలుపులు వేసి, ఆందోళన చేశారు. సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవరెడ్డి మాట్లాడారు. ఏడాదిగా రెగ్యులర్ తహసీల్దార్ లేరని, ఉరవకొండ తహసీల్దార్‌కు ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాధ్యతలు అప్పగించారని, ఆయన ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో తెలియని పరిస్థితి అన్నారు. సర్టిఫికెట్లు పొందాలన్నా, భూ సమస్యలున్నా పట్టించుకునేవారులేరన్నారు. డీటీ ఉదయ్ భాస్కర్ ఆందోళనకారుల వద్దకు వచ్చి ధర్నా విరమించాలని కోరారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ మహబూబ్ బాషా ఫోన్‌లో విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పెరుగు సంగప్ప, రమణ, మల్లికార్జున, శ్రీరాములు, రమణప్ప,పార్వతీ ప్రసాద్, ప్రజలు పాల్గొన్నారు.

రెండోరోజూ 'శ్రీరామరెడ్డి' కార్మికుల పాదయాత్ర


కాలువపల్లి మీదుగా పాదయాత్ర చేపట్టిన శ్రీరామ రెడ్డి వాటర్ సప్లయి స్కీం వర్కర్స్

బెళుగుప్ప: ప్రభుత్వం వేతన బకాయి విడుదల చేయాలనే డిమాండ్‌తో కళ్యాణదుర్గం నుంచి అనంతపురం కలెక్టరేట్ వరకు శ్రీరామరెడ్డి వాటర్ సప్లయ్ స్కీం వర్కర్స్ చేపట్టిన పాదయాత్ర రెండో రోజూ కొనసాగింది. మండల పరిధిలోని హనిమరెడ్డిపల్లి మీదుగా రెండో రోజు గురువారం ప్రారంభమైంది. కాలువపల్లి, కాలువపల్లి తండా మీదుగా పంపనూరు వరకు కొనసాగనుంది. సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మాట్లాడుతూ ఎనిమిది నెలలుగా జీతాలు, 26 నెలల పీఎఫ్, కళ్యాణదుర్గం వారికి రెండు నెలల జీతాలు, పది నెలల పీఎఫ్, రాయదుర్గం పరిధిలో రెండు నెలల జీతాలు, పది నెలల పీఎఫ్ నిధులు విడుదల చేయాలని డిమాండ్‌లతో పాదయాత్రతో సమ్మె చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు తిక్కన్న, ఓబుళేసు, మోహన్, శంకరయ్య, రాఘవేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలి


మాట్లాడుతున్న ఆర్‌డీఓ వసంత్‌బాబు

కళ్యాణదుర్గం రూరల్: పరిశ్రమల ఏర్పాటుకు రైతులు సహకరించాలని ఆర్‌డీఓ వసంత్‌బాబు తెలిపారు. గురువారం కంబదూరు మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో ఏపీఎస్ హెచ్ఏఎల్ ఎన్ఆర్ఈ డీసీపీపీ సోలార్ ప్రాజెక్టు నిర్మాణానికి రైతులు, ప్రజలతో ఆర్‌డీఓ వసంత్‌బాబు గ్రామ సభ నిర్వహించారు. ఆర్‌డీఓ మాట్లాడుతూ ప్రాజెక్టు నెలకొల్పడానికి రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వాలన్నారు. ప్రాజెక్టుకు ఎంత భూమి అవసరం, కంపెనీ విధి విధానాలు, ప్రభుత్వ నిబంధనలు తదితర విషయాలపై గ్రామ రైతులకు వివరించారు. రైతులతో కంపెనీ అంగీకార పత్రంలోని వివరాలను చదివి వినించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలకిషన్, ఎన్టీపీసీ అధికారులు ఏజీఎం శివకుమార్, బాలాజీ కుమార్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్, గ్రామ సర్పంచ్ ముత్యాలమ్మ, స్థానిక ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

ఎరువు..కరువు


ఉరవకొండలోని ఓ ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపులో ఎరువులు స్టాక్


అమిద్యాలలో పంట వేసుకోవడానికి పొలం సిద్ధం చేసుకుంటున్న రైతు

- ఆర్ఎస్‌కేలకు సరఫరా కాని ఎరువులు
- దుక్కులు చేసుకొని పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు
- అవసరంలేని మందులు అంటగడుతున్న ప్రైవేట్ దుకాణ యజమానులు

ఉరవకొండ: ఖరీఫ్ ప్రారంభమైంది..నైరుతి రుతు పవనాలు ప్రభావం లేకపోయినా అరకొర వర్షాలు పడ్డాయి.. ఎంతో ఆశతో రైతులు పొలాలను దుక్కులు చేసుకొని పంటల సాగుకు సిద్ధం అవుతున్నారు. అయితే నేటికీ రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు ఇవ్వలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సకాలంలో సబ్సిడీ విత్తనాలు, రసాయన ఎరువులు ఆర్‌బీకేల ద్వారా అందించే వారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని గాలికొదిలేసింది. అప్పు చేసి ప్రైవేట్ దుకాణాల వద్దకు వెళ్లే వారు తెలిసిన ఎరువులు కాకుండా మరొకటి అంటగడుతున్నారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 2,90,473 హెక్టార్లు కాగా, ప్రస్తుతం 1,74,179 హెక్టార్లలో సాగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇందులో మెజార్టీ సాగు వేరుశనగ కాగా, తర్వాత స్థానాల్లో కంది, ఆముదం, పత్తి, సజ్జ, ఉలువ, పొద్దు తిరుగుడు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం మూడు నియోజకవర్గాల్లోని 15 మండలాలకు సుమారు 50వేల క్వింటాళ్ల విత్తనం అవసరం అయితే ఇప్పటి వరకు 40,512 క్వింటాళ్లు మాత్రమే కేటాయించారు. 40 శాతం రాయితీతో విత్తన వేరుశనగ అందిస్తున్న కూటమి సర్కార్ కే-6 తోపాటు కొత్తగా టీసీజీఎస్-1 694, కదిరి, లేపాక్షి(కే-1812) రకాలు పంపిణీ చేపట్టింది. విత్తనాలు వేసే సమయంలో రసాయన ఎరువులను విత్తనాలతో కలిపి వేసుకుంటారు. అయితే ఇంకా రైతు సేవా కేంద్రాలకు రసాయన ఎరువులు రాలేదు. దీంతో రైతులు అప్పు చేసి ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపులు కొన్ని అవసరం ఉన్నా లేకున్నా ఎక్కువ మందులను రైతులకు అంటగడుతున్నారు. అధికారులు మాత్రం దీన్ని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ప్రైవేట్ దుకాణాల్లో దోపిడీ



ఐదెకరాల్లో వేరుశనగ, ఆముదం పంటలు సాగు చేద్దామని పొలం సిద్ధం చేసుకున్నా. పంటల సాగుకు రసాయన ఎరువులు అవసరం. ఇప్పటికీ ఆర్ఎస్‌కేలకు ఎరువులు సరఫరా చేయలేదు. దీంతో ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపులకెళ్లి కొనుగోలు చేస్తున్నాం. ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి.

– రాఘవేంద్ర, రైతు వి.కొత్తకోట గ్రామం, విడపనకల్లు మండలం

ప్రభుత్వమే ఎరువులివ్వాలి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు గ్రామాల్లోనే ఆర్ఎస్‌కేల ద్వారా విత్తనాలు, ఎరువులు అందించేవారు. ఉన్న ఊళ్లోనే ఆర్‌బీకేలకు వెళ్లి పైసా ఖర్చు లేకుండా తీసుకొచ్చే వారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎరువులు అందుబాటులో లేకుండా చేసింది. ప్రభుత్వమే ఎరువులను ఆర్ఎస్‌కేల ద్వారా అందించాలి.

– యోగేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ రైతు విభాగం నాయకులు

సమస్యల పరిష్కారానికి త్వరితగతిన కృషి

ఉరవకొండ రూరల్: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి త్వరితగతిన కృషి చేస్తామని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. గురువారం మండలంలోని మోపిడిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటా తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీఓ రవిప్రసాద్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురు పేకాట రాయుళ్ల అరెస్టు

బొమ్మనహాళ్: మండలంలోని దేవగిరి గ్రామ శివారులోని పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను బొమ్మనహాళ్ పోలీసులు అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ నబీ రసూల్ తన సిబ్బందితో దాడులు నిర్వహించి, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.5,200 నగదు, 52 పేక ముక్కలను, మూడు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వీరిని రాయదుర్గం కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు పూర్తి చేయండి

కణేకల్లు: హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు ఈనెల 10 కల్లా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అధికారులు, కాంట్రాక్టర్లకు ఆదేశించారు. యర్రగుంట శివారులో 137 కిలో మీటర్ వద్ద యూటీ (అండర్ టన్నెల్) పనులను ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ సబ్ డివిజన్ డీఈఈ దివాకర్‌రెడ్డి, ఏఈఈ నరేంద్ర మారుతి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వన్నారెడ్డి, మాజీ వైస్ సర్పంచు ఆనంద్‌రాజ్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ చాంద్ బాషా, డీసీ కమిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్ పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించండి

ఉరవకొండ రూరల్: రెండు నెలలుగా తాగునీరు సరఫరా కాక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్య పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.కృష్ణమూర్తి, ఆ పార్టీ నాయకులు మురళి వీరాంజనేయులు, రామాంజనేయులు మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందించారు. గురువారం మోపిడిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. బీసీ కాలనీతో పాటు, చాలా కాలనీల్లో సీసీ రోడ్లు , డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగు నీరు రోడ్లపై పారుతోందని సీపీఎం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీవో రవి ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్‌గా సోమశేఖర్


ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్‌గా ఎంపికైన సోమశేఖర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్‌గా రాయంపల్లి గ్రామానికి చెందిన సోమశేఖర్ గురువారం నియమితులయ్యారు. జిల్లా ఇన్‌చార్జ్ చిన్నసుబ్బారావు నియామక పత్రం అందించారు. ఈసందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ దళితుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడతానన్నారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథి గృంలో కన్వీనర్‌గా నియమితులైన సోమశేఖర్‌ను ప్రజాసంఘాల నేతలు పాల్తూరు ఆనందరాజు, చాబాల సర్పంచ్ మల్లెల జగదీష్, మీనుగ గోపాల్, చంద్రశేఖర్, ఎర్రిస్వామి, మీనుగ రామాంజనేయులు తదితరులు సత్కరించారు.

ఘనంగా భారతీయ క్రైస్తవ దినోత్సవం


రాయదుర్గం యెరుషలేము చర్చిలో క్రైస్తవ దినోత్సవ సభ నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ము త్తరాసి కాలనీలోని యెరుషలేము చర్చిలో భారతీయ క్రైస్తవ దినో త్సవాన్ని గురువారం జరుపుకున్నారు. పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు జ య చంద్రబాబు, కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఏటా జూలై 3న భారతీయ క్రైస్తవ దినోత్సవాన్ని క్రైస్తవులు జరుకుంటారన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్, కోశాధికారి ఆనంద్, పాస్టర్లు పాల్గొన్నారు.

10న గుండె, కంటి వైద్య శిబిరం

కూడేరు: మండలంలోని కరుట్లపల్లిలో సచివాలయం వద్ద ఈ నెల 10న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత గుండె, కంటి వైద్య శిబిరం ఉంటుందని సర్పంచ్ ఓబుళమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

పిల్ల కాలువల్లో పూడికతీతకు చర్యలు



కొలిమివీధిలో పూడిక తీస్తున్న కార్మికులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కొలిమివీధి, పాత మీసేవ ఏరియా, వడ్డే వీధుల్లోని పిల్ల కాలువల్లో పూడిక తీతకు అధికారులు గురువారం చర్యలు చేపట్టారు. పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో కార్మికులు పూడిక తీశారు. పై కాలనీల్లోని అంతర్గత డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగునీరు ముందుకు సాగకపోవడంపై 'ఇదేనా స్వచ్ఛ రాయదుర్గం' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ అధికారులు గురువారం పూడిక తీయించారు. ఖాళీ స్థలాల్లో ఎవరైనా చెత్తవేస్తే జరిమానా తప్పదని బోర్డులు ఏర్పాటు చేయించారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్ మాట్లాడారు.

9న దేశ వ్యాప్త సమ్మె


దేశ వ్యాప్త సమ్మె పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

బెళుగుప్ప: ఈనెల 9న దేశ వ్యాప్తంగా కార్మిక ప్రజా సంఘాలు చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేద్దామని అని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు బీమన్న, మల్లి, సత్యవతి, సుజాత, శంకరయ్య, నారాయణస్వామి పాల్గొన్నారు.

సాయి, రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు


రాయదుర్గంటౌన్: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయం, రాఘవేంద్రస్వామి ఆలయాల్లో గురువారం భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సాయి ఆలయంలో స్వామికి మంగళహారతి, అర్చనలు చేశారు. పట్టణంలోని కోటలో వెలసిన రాఘవేంద్రస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

ఉపాధ్యాయుల సేవలు మరవలేనివి


ప్రధానోపాధ్యాయురాలు శైలజను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గుమ్మఘట్ట: సమాజంలో ఉపాధ్యాయుల సేవలు మరవలేనివని గొనిగుంట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కారుమంచి తెలిపారు. మండలంలోని గొనిగుంట ప్రాథమిక పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయురాలు శైలజను ను సన్మానించారు. హెచ్ఎం మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నా రు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, తిప్పేస్వామి, శారద బాయి, శ్రీనివాసకుమార్ పాల్గొన్నారు.

సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో ప్రార్థనలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో గురువారం భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గురువారం స్వామివారం కావడంతో భక్తులు స్వామి దర్శనార్థం ఆంధ్రా,కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి దర్శనానికి బారులుతీరారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి, ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. భక్తులు దర్గా ఆవరణలో కందూరీలు చేశారు.